జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 28 ఏప్రిల్ 2025
www.ntnews.com


## కొనే బంగారం కాదు.. చేసే దానం అక్షయం


బుధవారం అక్షయ తృతీయ

**వైశాఖ** మాసం శుక్లపక్షంలో వచ్చే తదియను 'అక్షయ తృతీయ' అంటారు. 'మహాభారతం'లో ధర్మరాజు సూర్యారాధన చేసి, భాస్కరుడి నుంచి అక్షయపాత్రను పొందిన రోజు ఇదేననీ, అందువల్ల ఈ పర్వదినం 'అక్షయ తృతీయ'గా ప్రసిద్ధి పొందిందనీ కొందరి విశ్వాసం. అక్షయ తృతీయ రోజు బంగారం కొంటే అక్షయమైన సంపదలు కలుగుతాయన్న విశ్వాసం ఉంది. అయితే, దీనికి శాస్త్ర ప్రమాణం కనిపించదు. ఈరోజు చేసే పుణ్యకార్యాలు, జపతపాలు, దానధర్మాలు అక్షయమైన ఫలితాలు ఇస్తాయని శాస్త్ర వచనం. దానాలలో స్వర్ణదానం శ్రేష్ఠమైనదని చెబుతారు. అక్షయ తృతీయ సందర్భంగా బంగారం దానమివ్వాలే కానీ, కొనుగోలు చేయడం వల్ల కలిగే ప్రయోజనం వ్యక్తిగత సంతృప్తి మాత్రమే! పార్వతీదేవికి అక్షయ తృతీయ ప్రత్యేకతను వివరించిన పరమేశ్వరుడు 'ఈ పర్వదినం నాడు అక్షయ స్వరూపుడైన దైవాన్ని ఆరాధిస్తే అనంతమైన అనుగ్రహం కలుగుతుంద'ని వివరించాడట. పరమ పవిత్రమైన గంగానది దివినుంచి భువికి దిగివచ్చిన రోజు ఇదేనని పురాణ కథనం. అంతేకాదు, కుచేలుడు శ్రీకృష్ణ దర్శనంతో అక్షయమైన సంపదలు పొందిన రోజు ఇదేనని కొందరి భావన. ఒక పేదరాలు తన జోలెలో వేసిన ఉసిరికాయను స్వీకరించి, ఆమె దాన గుణాన్ని గుర్తించి ఆదిశంకరులు అమ్మవారిని 'కనకధారా స్తోత్రం'తో ప్రార్థించి ఆ పేదరాలి ఇంట బంగారు ఉసిరికాయల వాన కురిపించింది కూడా వైశాఖ శుద్ధ తదియనాడే అని చెబుతారు. ఈ రోజు ఆచరించే మంచి పనులు ఏవిధంగా అయితే ఉత్తమ ఫలితాలను ఇస్తాయో, దుష్కార్యాలు చేస్తే వాటి ప్రభావం కూడా అక్షయంగా వెంటాడుతుందని పెద్దల మాట. అందుకే, ఉన్నంతలో పేదలకు దానం ఇవ్వడం, భగవన్నామ స్మరణ వల్ల దైవానుగ్రహం అనంతంగా పొందగలుగుతాం.

... భార్గవ్




# మథురపై మగధ దాడి

**శు**క యోగి పరీక్షిత్తుతో- రాజా! సారమతి- స్థిరచిత్తంతో గిరిధారి, గోకుల విహారి, కంసారి కృష్ణుని కీర్తిస్తూ మధురాపురి చేరిన హరిదాసవర్యుడు ఉద్ధవుడు, అఘ సంహారి- పాపాలను రూపుమాపేవాడు, రిపుజన మదాపహారి- శత్రువుల మదమును మర్దించేవాడు, వనమాలాధారి శౌరిని- పరమాత్మని దర్శించాడు. నందాది గోపకులు, గోపికా బృందం ప్రేమబంధంతో పంపిన కానుకలను రామకృష్ణులకు, ఉగ్రసేన మహారాజుకి కడు వేడుకతో విడి- విడిగా సమర్పించాడు. తదుపరి ఏకాంతంగా, ''ప్రేమమూర్తులైన గోప భామలను వ్రేపల్లెలో దుస్సహమైన విరహవేదనకు గురిచేసి, ఓ రాధాకాంతా! నువ్వు మథురలో ఎలా మనగలుగుతున్నావు? గోవిందా! ఇదేనా నీ 'సచ్చిదానంద' స్వరూపం?'' అని ఉద్ధవుడు అధిక్షేపించ- ఎత్తిపొడవగా మాధవుడు- 'ఉద్ధవా! కామతప్తయైన కుబ్జను- సైరంధ్రిని సైతం నేను ఉపేక్షింపలేనే! అలాంటిది, తమ అన్ని అపేక్ష- ఆకాంక్షలను నాకే సమర్పించి ఉన్న ఆ గోప పురంధ్రీ- స్త్రీ మణులను ఉపేక్షిస్తానా? నా ప్రతి రోమకూపంలో ఆ రమణలే రమిస్తున్నారు' అని పలికాడు.

రాజా! గతంలో ఇచ్చిన వాగ్దానం నెరవేర్చడానికి అబ్జాక్షుడు- కృష్ణుడు ఉద్ధవునితో కలసి కుబ్జ గృహానికి వెళ్లి ఆ సరోజముఖిని మనోజ కేళిలో కరగించాడు. ఆమె మదనతాపాన్ని దిగవిడిచింది.

**క|| 'ఏ వేదంబుల గానని**
**దేవోత్తము గాంచి ముక్తి తెరువడుగక రా**
**జీవేక్షణ రతి యడిగెను**
**భావింప దదీయ కర్మఫల మెట్టిదియో?'..**

ఇందుముఖి త్రివక్ర- కుబ్జ పూర్వం తాను గోవిందునికి సమర్పించిన సుగంధ లేపనాల లేశమైన- కొద్ది పుణ్య ప్రభావం చేత, వేదాలకు కూడా అందరాని ముకుందుని కని కూడా ముక్తిని కోరక, పూనిక- పూర్వ జన్మ సంస్కార బలంతో అతని పొందును కోరింది. లీలా రసికుడు ఆ బాలామణిని మన్మథ సౌఖ్యాలలో ఓలలాడించాడు. కోరిన దానిని కాదనక ఆమోదించి ఇవ్వడం దామోదరుని స్వభావం కదా! కుబ్జ చెలికత్తెలందరూ 'ఇది నిజంగా కనీ వినీ ఎరుగని- అరుదైన భాగ్యం' అని కొనియాడగా శ్రీశుకముని మాత్రం ఆమెని 'భాగ్యహీన'గా పేర్కొని ముందుకు సాగాడు. అటుపిమ్మట చతుర నటమూర్తి కృష్ణుడు రామ, ఉద్ధవులను వెంటపెట్టుకొని అక్రూరుని ఇంటికి వెళ్లాడు. ఆనందంతో అందలమెక్కిన అక్రూరుడు కొందలపాటు (కలత, సంతాపం) మాని త్రివిక్రముని అడుగులను తన ఒడిలో ఇడు- పెట్టుకొని ఒత్తుతూ ఇలా నుడివాడు-

**శా|| 'ఏ పుణ్యాతిశయ ప్రభావముతో యీ జన్మమందిక్కడన్**
**నీ పాదంబులు గంటి నిన్నెఱిగితిన్ నీవుం గృపాళుండవై**
**నాపై నర్మిలి జేసి మాన్పగదవే నానా ధనాగార కాం**
**తా పుత్రాదుల తోడి బంధనము భక్త వ్రాత చింతామణీ!'**

'మధుసూదనా! నీ ఆగమనం వలన మా సదనాలు- గృహాలు పావనమయ్యాయి. భక్తుల పాలిటి చింతామణివైన శ్రీకాంతా! అశేషమైన ఏ పుణ్య విశేష మహిమ వల్లనో ఈ జన్మలో ఇక్కడ నీ చరణ కమలాలను కనగలిగాను. నిన్ను తెలుసుకొన గలిగాను. నీవు కూడా నా మీది ప్రేమతో కృప చూపి, నా చిత్తంలోని గృహ విత్త (ధన) దార (భార్యా) పుత్రాదుల మీది మోహ పాశాన్ని ఉత్తరించు- కత్తిరించు!'- పరమాత్మ ఇలా ప్రత్యుత్తరమిచ్చాడు..

**చ|| 'కొలుతురు మర్త్యులిష్టములు గోరి శిలామయ దేవ సంఘమున్**
**జలమయ తీర్థ సంఘమును సంతతమున్నటు వారు గొల్వగా**
**వలదనరాదు గాక భగవత్పద భక్తులరైన మీ క్రియన్**
**సొలయక దేవ తీర్థములు చూచినయంతనె కోర్కులిచ్చునే?'..**

'మహాత్మా! మరణ శీలురైన మానవులు కోరికలు తీర్చుకొనగోరి తమ కరణ కళేబరాలతో- ఏకాదశ ఇంద్రియాలతో దేవతల శిలా ప్రతిమలను, గంగాది జలాపూర్ణాలైన పుణ్యతీర్థాలను నిరంతరం సేవిస్తూ ఉంటారు. ప్రగాఢమైన భక్తి విశ్వాసాలతో కూడిన వారి సేవలను కూడదని వారించడం పాడి కాదు. నిజానికి, భగవత్పద భక్తులైన- జంగమ దేవరలు, తీర్థాలైన మీ వలె విగ్రహారాధనం, పుణ్య తీర్థ సేవనం దర్శన మాత్రాన అభీష్టాలను అనుగ్రహించగలవా? అవి ఫలించడానికి చాలా సమయం పడుతుంది.' అనంతరం ఉద్ధవ బలరామ సహితుడై శ్రీకృష్ణుడు తన నివాసానికి చేరాడు.

శుకుడు- రాజా! కంసుని భార్యలైన అస్తి, ప్రాప్తి వైధవ్యం పొంది దుఃఖిస్తూ తండ్రియైన జరాసంధుని చెంతకు చేరి, మాకు దానవ హంత అయిన శ్రీకృష్ణుని వలన ఈ దుర్గతి కలిగిందని వాపోయారు. 'బిడ్డలారా! ఈ గడ్డని యాదవ రహితం చేస్తా' అని శపథం చేసి జరాసంధుడు యుద్ధభేరి మ్రోగించాడు. ఇరవై మూడు అక్షౌహిణీ సైన్యం వెంటరాగా, చెలియలికట్టను అతిక్రమించి పొంగి వెడలివచ్చే కడలి వలె మథురా నగరాన్ని చుట్టుముట్టాడు. సమయజ్ఞుడైన కమలాప్రియుడు కృష్ణుడు- 'నేనవతరించింది భూభారాన్ని వారించడానికే కనుక నేటి నుండీ ఆ ప్రయోజనానికి పూనుకొంటా. ఈ జరాసంధుని పట్ల సామ దాన భేదోపాయాలు నిరుపయోగాలు. ఈ ఉద్దండుని యెడల దండోపాయం ప్రయోగించి భూభారం తొలగిస్తా. వీని సైన్యాన్ని నశింపజేసి, వీనిని చంపకుండా, వెనుకకు పంపిస్తే, మరల మరల మిగులు సైన్యంతో కసిగా కదనానికి కదలి వస్తూంటాడు. అలాగ ఇలా (భూ) భారాన్ని తొలగించి, అవతల వీడి తల తీయించవచ్చు' అని తలపోశాడు.

**క|| 'ఖరులై దృఢ కవచ ధను**
**శ్శరులై యధిగత రథానుచరులై మదవ**
**త్కరులై ఘన హరులై బల**
**హరులయ్యెడ నాజికేగి రతి భీకరులై'...**

వాడిమి- తేజః ప్రతాపాలు గల రామ కృష్ణులు దృఢమైన కవచాలు, ధనుస్సులు, నారాచాలు- బాణాలు, మదగజాలు, ఘనమైన అశ్వాలు, అనుచరులతో అతి భయంకరులై సంగర రంగానికి తరలి వచ్చారు. 'బలహరులు' అనగా బలరామకృష్ణులని, 'శత్రు బలాన్ని హరించేవారు' అని కూడా శ్లేషార్థం! గంభీరము, దివిజ తాపస మాన్యము- దేవ మునులచే మన్నింపబడేది, ప్రీత భక్త రాజన్యము- భక్తులైన రాజవర్గాన్ని ఆనంద పరచేది, భీత దుశ్చరిత శాత్రవ సైన్యము- చెడు నడతగల శత్రుసైన్యానికి కడు భయంకరము, ధన్యమూ అయిన పాంచజన్య శంఖాన్ని పూరించాడు కాంచనచేలుడు కృష్ణుడు.

**క|| 'సింధుర భంజన పూరిత**
**బంధుర తర శంఖ నినద భారమున జరా**
**సంధునికింగల సైన్యము**
**లంధములై సంచలించె నాహవ భూమిన్'...**

సింధుర- గజములను, భంజిస్తూ- భంగపరుస్తూ, పంకజనాభుడు పూరించిన, బంధురతర- సింహగర్జన వంటి కఠినమైన పాంచజన్య శంఖ నినాద భారంతో జరాసంధుని సేనలన్నీ వరాక (యుద్ధ) రంగంలో, అంధములై- కన్నులు కానరాక కంపించిపోయాయి. వీనులకు విందు చేసే ఇలాంటి అందమైన కందాల కెందామరలు (రక్త కమలాలు) పోతనగారి భాగవత సరస్సులో కోకొల్లలు. శుకుడు- రాజా! ఆ సమయంలో మగధనాథుడు మధురానాథునితో ఇలా చులకనగా పలికాడు..

**సీ|| 'అదలించి రొప్పంగ నాల మందలుగావు**
**గంధ గజేంద్ర సంఘములు గాని**
**పరికించి వినగ నంభా రవంబులు గావు**
**వాజీంద్ర హేషా రవములు గాని**
**పదహతి గూల్పంగ బ్రాత బండ్లివి గావు**
**నగ సమాన స్యందనములు గాని**
**ప్రియము లాడంగ నాభీరలోకము గాదు**
**కాలాభవైరి వర్గంబుగాని**
**తే|| యార్ప వనవహ్ని గాదు బాణాగ్ని గాని**
**మురియు బృందావనము గాదు మొనలు గాని**
**యమున గాదు నటింప ఘోరాజి గాని**
**పోరు నీకేల? గోపాల! పొమ్ము పొమ్ము'...**

ఓయీ! గోపాలకా! ఇవి మదించిన ఏనుగుల గుంపులు గాని, అదలించి పారదోలడానికి ఆలమందలు గావు. ఇవి సింధు దేశపు గుర్రాల సకలింపులు గాని, వీనులొగ్గి వినడానికి వృషభాల అంభారావాలు గావు. ఇవి కొండల వంటి రథాలు గాని, కాలితో తంతే కూలి ముక్కలయ్యే పాత చెక్కబండ్లు గావు. ఇది శమను- యముని వంటి శత్రు సమూహం గాని, సరస సల్లాపాలు ఆడుకోడానికి గొల్లపిల్లల గుంపు గాదు. ఇది ప్రచండమైన బాణాగ్ని గాని, లీలగా ఆర్పివేయడానికి దావానలం- కార్చిచ్చు కాదు. మురిసిపోయి తిరగడానికి ఇది కదనరంగం- సేనా వ్యూహంగాని, మెరిసిపోయే బృందావనం కాదు. నర్తించడానికిది (జీవించినంత వరకు గుర్తుండిపోయే) ఘోరమైన యుద్ధభూమి గాని, వన్నెచిన్నెల యమున ఇసుక తిన్నెలు గావు. శశివదనా! మదన జనకా! ఈ కదనం- యుద్ధం నీకేల? నీ సదనానికి పోపొమ్ము. ఈ సీస పద్యం 'వ్యాజ స్తుతి' (నిందలో స్తుతి, స్తుతిలో నింద) అలంకారానికి అవ్యాజమైన- అకృత్రిమమైన దృష్టాంతము.

**మ|| 'తరుణిం జంపుటయో బకుం గెడపుటో ధాత్రీజముల్ గూల్చుటో**
**ఖరముం ద్రుంచుటయో ఫణిం బరపుటో గాలిన్ నిబంధించుటో**
**గిరి హస్తంబున దాల్చుటో లయ మహాగ్ని స్ఫార దుర్వార దు**
**ర్భర బాణాహతి నెట్లు నిల్చెదవు స ప్రాణుండవై గోపకా!'..**

గోపకిశోరా! ఇది (యుద్ధం) యువతిని చంపడం (పూతనా మోక్షణం) కాదు. బకాన్ని- కొంగను తెగవేయడం (బకాసుర వధ) కాదు. చెట్లను కూల్చడం (యమళార్జున భంజనం) కాదు. గాడిదను కూలదన్నుట (గార్దభాకారుడైన ధేనకాసుర వధ) కాదు. పామును పారదోలుట (కాళియ మర్దనం) కాదు. గాలిని నిరోధించడం (తృణావర్త తృణీకారం- వధ) కాదు. కరమున గిరిని ధరించుట (గోవర్ధనోద్ధరణం) కాదు. ప్రళయకాల అగ్నివలె దీపించు- మండు దుర్వారాలు- వారింపరానివి, దుస్సహాలు- సహింపజాలనివి అయిన నా బాణాల దెబ్బలకు ఓర్చుకొని ఓ యబ్బా! నీవు ప్రాణాలతో ఉండగలవా? కంత (కామ) జనకా! అంతేకాదు..

**సీ|| 'గోపికా వల్లకీ ఘోషణంబులు గావు,**
**శింజినీ రవములు చెవుడు పరుచు**
**వల్లవీ కరముక్త వారి ధారలు గావు,**
**శరవృష్టిధారలు చక్కుసేయు**
**ఘోషాంగనా పాంగ కుటిలాహతులు గావు,**
**నిశితాసి నిహతులు నిగ్రహించు**
**నా భీరకామినీ హస్తాబ్జములు గావు,**
**ముష్టిఘాతంబులు మురువుడించు'**
**తే|| నల్ల వ్రేపల్లెగాదు ఘోరావనీశ**
**మకర సంఘాత సంపూర్ణ మగధరాజ**
**వాహినీ సాగరంబిది వనజనేత్ర!**
**నెరసి నిను దీవికైవడి నేడు ముంచు'**

వారిజాక్షా! ఈ రణభేరి రంగంలో వినబడేవి చెవులు చిల్లులు పడే శింజనీ- అల్లే త్రాటి మోతలు కాని, మనోరంజనం చేసే గొల్ల పడతుల వల్లకీ ఘోషణాలు- వీణానాదాలు కావు. ఇవి జలక్రీడలో గోపికా ప్రోడలు నీపై చల్లే నీటి జల్లులు కావు, శత్రు సైనికులు అమర్షం- క్రోధంతో కురిపించు బాణాల వర్షధారలు. నీ దేహాన్ని తుత్తునియలు చేస్తాయి. ఇవి గొల్ల వాల్గంటుల క్రీగంటి చూపుల విరుల తూపులు- పూల బాణాలు కావు, భండనంలో నిశితమైన అసి ఖండనాలు- వాడి అయిన కత్తి వ్రేటులు. నీ తిత్తి తీస్తాయి. ఇవి, వ్రేతల- గోపికల తామర తూడ్ల వంటి సుతిమెత్తని చేతులు కావు, అతి కఠినమైన పిడికిటి పోట్లు. నీ పోడిమి (సొంపు, సంపద, గర్వం)ని పాడు చేస్తాయి. ఇది గొల్లపల్లె కాదు, ఉగ్ర రాజులనే గ్రాహాల- మొసళ్లతో నిండిన జరాసంధుని సేనా సాగరం. మహా సముద్రం ఉప్పొంగి దీవిని ముంచునట్లు ఇది నిన్ను ముంచేస్తుంది సుమా! అమూలకాలైన పై రెండు సీస పద్యాలు, మత్తేభ వృత్తం సహజ పాండిత్యుని అసమాన కల్పనాప్రతిభా భాసమానాలు.

(సశేషం)


తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

# చందన చర్చిత.. అప్పన్న

సందర్భం



**అక్షయ** తృతీయ పర్వదినం సింహాచల క్షేత్రంలో ప్రత్యేకంగా జరుగుతుంది. ఏడాదంతా మణుగుల కొద్దీ చందనాన్ని అలదుకున్న అప్పన్న అక్షయ తృతీయ సందర్భంగా నిజరూపంలో భక్తులను అనుగ్రహిస్తాడు. తన భక్తుడైన ప్రహ్లాదుడిని కాపాడేందుకు శ్రీహరి.. నరకేసరిగా ఈ సింహాచలంపై అవతరించాడు. ప్రహ్లాదునితో హరినామ స్మరణ మాన్పించడానికి హిరణ్యకశిపుడు నానా విధాలుగా పసిబాలకుణ్ని ఇక్కట్లకు గురిచేశాడు. ప్రహ్లాదుడిని సముద్రంలో పడవేయించాడు. ఆ పసిబాలుణ్ని శ్రీహరి కాపాడాడు. కొండపై నుంచి పడదోశాడు. మహావిష్ణువు అక్కడ ప్రత్యక్షమై.. మళ్లీ రక్షించాడు. తనను ఆదుకున్న నారాయణుడిని ప్రహ్లాదుడు స్తుతించగా.. ఆ బాల భక్తుడికి వరాహ నరసింహ రూపాన్ని అనుగ్రహించాడు విష్ణుమూర్తి. తన భక్తుడి కోరిక మీద ఆ కొండపైనే, అదే రూపంలో స్థిరంగా ఉండిపోయాడు. హిరణ్యకశిపుడి సంహారం తర్వాత ప్రహ్లాదుడు వరాహ నృసింహస్వామికి దేవాలయాన్ని కట్టించాడని స్థలపురాణం చెబుతున్నది.

ఇక్కడ కొలువుదీరిన స్వామికి చందనం ప్రీతి. స్వామి ఉగ్రరూపాన్ని ఉపశమింపజేయడానికి నిత్యం మణుగుల కొద్దీ చందనాన్ని మూలమూర్తికి అలదుతుంటారు అర్చకులు. పొరలు పొరలుగా చందనం అలదడంతో స్వామి విగ్రహం లింగాకారంగా దర్శనమిస్తుంది. ఏటా వైశాఖ శుక్ల తదియ (అక్షయ తృతీయ) నాడు సశాస్త్రీయంగా, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ చందనాన్ని మొత్తంగా తొలగిస్తారు. ఆనాడు లభించే నిజరూప దర్శనం కోసం భక్తులు పోటెత్తుతారు. స్వామి నుంచి వెలికి తీసిన చందనాన్ని ప్రసాదంగా భక్తులు తీసుకుంటారు. దీనిని ధరించడం ద్వారా, ప్రసాదంగా తీసుకోవడం ద్వారా సకల అభీష్టాలు నెరవేరుతాయనీ, ఆరోగ్యం లభిస్తుందని భక్తుల నమ్మిక.

కాలక్రమంలో ఈ ఆలయం శిథిలం కాగా, పురూరవ చక్రవర్తికి వరాహ లక్ష్మీనరసింహ స్వామి దర్శనమైందట. ఆయనే సింహాద్రి ఆలయాన్ని పునరుద్ధరించాడట. ఆ సమయంలో పురూరవుడు స్వామి పాదాలను దర్శించలేకపోయాడట. కలత చెందిన పురూరవుడితో అశరీర వాణి 'మహారాజా! ఈ స్వామి పాదాలను నీవు దర్శించలేవు, కానీ స్వామి వారిని శాస్త్రోక్తంగా అర్చించి, ఆ దివ్య మంగళ విగ్రహం నిండా చందనం అలంకరించు. భక్తులెవ్వరూ మిగిలిన రోజులలో స్వామి నిజరూపాన్ని దర్శించలేరు, అక్షయ తదియ రోజు మాత్రమే చందనం పూర్తిగా తొలగించిన తరువాత నిజరూప దర్శనం చేసుకోగలరు' అని పలికిందట. పురూరవుడు అలాగే చందనం అలది స్వామిని పూజించాడట. అప్పటినుంచి ఇక్కడ నిత్య చందనోత్సవం సంప్రదాయంగా వస్తున్నది.

... డా|| కండ్లకుంట నరసింహమూర్తి
94401 60035

కథాసుధ

# సత్యం ఒక్కటే!



**ఒక** గ్రామంలో జాతర జరుగుతున్నది. ఆ జాతరకు ఊళ్లోని పదేండ్లలోపు పిల్లలంతా ఏదో ఒక వేషం వేస్తారు. ఆ సమయంలో అక్కడ గుమికూడిన గ్రామస్తుల్లో 'ఏ దేవుడు గొప్ప?' అనే చర్చ మొదలైంది. ఆధ్యాత్మిక పరిజ్ఞానం ఉన్న మేకప్ చేసే వ్యక్తి ఇదంతా గమనించాడు. గ్రామస్తులందరినీ కాసేపు శాంతంగా కూర్చోమని చెప్పాడు. గంట సమయం తనకిస్తే... ఏ దేవుడు గొప్పో తెలియజేస్తానని వారిని ఒప్పించాడు. వేషం వేయడానికి వచ్చిన పిల్లల్లో ఒకరిని పిలిచాడు. 'నీ పేరేమి?' అని అడిగాడు మేకప్ చేసే వ్యక్తి. 'రామచంద్రం' అని బదులిచ్చాడు ఆ పిల్లవాడు. ఆ పిల్లవాడిని తెర వెనుకకు తీసుకెళ్లి తన సిబ్బందితో కృష్ణుడి వేషం వేయించాడు. వేదికపైన నిలబెట్టి గ్రామస్తులకు చూపిస్తూ ఇతడు ఎవరు? అని అడిగాడు. కృష్ణుడు అని అందరూ ఒకేసారి చెప్పారు. వెంటనే ఆ పిల్లవాడికి మేకప్ తీయించి బుద్ధుడి వేషం వేయించాడు. 'ఇతను ఎవరు?' అని మళ్లీ అడిగాడు. 'బుద్ధుడు' అని అందరూ సమాధానం ఇచ్చారు. ఆ పిల్లవాడికి మేకప్ తొలగించి మళ్లీ వేదికపైకి తీసుకొచ్చాడు. అబ్బాయిని చూపుతూ.. 'ఇప్పుడు ఇతను ఎవరో చెప్పండి?' అన్నాడు. 'మాకెందుకు తెలియదు, మన ఊరి రామచంద్రుడు కదా!' అన్నారు. మేకప్ ఆర్టిస్టు చిన్నగా నవ్వి.. 'నిజమే, రామచంద్రుడనే పిల్లవాడికి కృష్ణుడి వేషం వేసి కృష్ణుడు అన్నాం, బుద్ధుడి వేషం వేసి బుద్ధుడు అన్నాం. మనకి నచ్చిన వేషం వేసి వేరువేరు పేర్లతో మనం ఈ పిల్లవాడిని పిలవవచ్చు. కానీ, అసలైన రామచంద్రుడు ఒక్కడే కదా! అలాగే మనం దేవుళ్లని రకరకాలుగా వర్ణించుకుంటాం. పూజలు చేస్తాం. ఎవరు ఎన్ని చెప్పినా సత్యం ఒక్కటే, సృష్టికర్త ఒక్కడే. ఉన్నది ఒకే శక్తి. మనకు వచ్చే భేదాలు, కలతలు, కల్లోలాలు అన్నీ దృష్టి భేదం వల్ల కలిగేవే' అని వివరించాడు. ఆయన మాటలతో గ్రామస్తులకు కనువిప్పు కలిగింది. జాతర జోరుగా సాగిపోయింది.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821

క్రీస్తు సందేశం

# తోమా పశ్చాత్తాపం

**మతానికి,** దైవభక్తికీ విశ్వాసం అనేది ప్రాణం. విశ్వాసం అంటే ఒకానొక విషయాన్ని గాని, వ్యక్తిని గానీ, సిద్ధాంతాన్ని గానీ ప్రగాఢంగా నమ్మడమే. విశ్వాసం లేని భక్తికి విలువ ఉండదు. అప్పటివరకూ ప్రభువుతోపాటు నడిచిన శిష్యుల్లో తోమా ఒకడు. పునరుత్థానం తర్వాత ప్రభువు కనిపించాడు అని చెబితే, ఆ సమయంలో తాను లేనందున తోమా దాన్ని నమ్మలేదు. సరికదా, 'నేను నా కళ్లారా చూస్తే గానీ నమ్మనంటే నమ్మను' అని భీష్మించాడు. అయనతో పోల్చుకుంటే, నేటి తరం విశ్వాసుల నమ్మిక చాలా గొప్పది! గాయపడ్డ క్రీస్తును కండ్లారా చూసి, ప్రభువుకు అయిన గాయాల్లో వేలు పెట్టి గానీ నమ్మలేని దుర్దశలో ఉన్నాడు తోమా! ఈ లెక్కన ప్రభువును చూడకుండానే నమ్ముతున్న విశ్వాసులు ఎంతటి ధన్యులో కదా!

పునరుత్థానం తర్వాత క్రీస్తు.. మరోసారి ప్రత్యక్షమై తన గాయాల్ని చూపించినప్పుడు గానీ తోమా నమ్మలేదు. విశేషం ఏమిటంటే.. ప్రభువుపై విశ్వాసం పెంచడానికి నడుం బిగించి మన భారతావనిపై కాలుమోపిన వ్యక్తి మరెవరో కాదు తోమానే! పునరుత్థానం తర్వాత క్రీస్తు నలభై రోజులపాటు ఈ నేలపై తిరిగాడని బైబిల్ చెబుతున్నది. అప్పుడప్పుడూ శిష్యులకు కనిపించి, వారు చేయవలసిన పనులను సూచించేవాడు. 'మీరు నమ్మిన సిద్ధాంతాన్ని అందరికీ బోధించమ'ని ప్రభువు వారికి చెప్పాడు. ఓసారి మేడ మీది గదిలో శిష్యులంతా గుమిగూడి ఉన్నారు. ఆ సమయంలో ప్రభువు తనలోని మహాశక్తిని వారిపైకి ఊది తేజోవంతులను చేశాడు. తర్వాత మరో వారానికి ఆయన శిష్యులకు కనబడినప్పుడు తోమా కండ్లు తెరుచుకున్నాయి. అతనికి జ్ఞానోదయం అయింది. పశ్చాత్తాపం చెందాడు. కండ్ల నుంచి జలజలా రాలిన బాష్పాలతో తోమా చూపులు ఈ నేలవైపునకు దృష్టి సారించాయి (యోహాను 20:19-31).

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024

